ఈనాడు ఆదివారం - 11, అక్టోబర్ 1998

# దైవాంశ!

విమల ఏం మాట్లాడినా రాఘవకు బుద్ధిమంతుడిలా వినడం, తలూపడం అలవాటు. ఆమె ఏ కథ చెప్పినా అందులోని సాధ్యాసాధ్యాల గురించి అతను ప్రశ్నించడు. ఆమె అబద్ధం చెప్పినా నిజం అనుకుంటాడు. నిజం చెబితే దాన్ని మించిన పరమసత్యం లేదంటాడు. అందుకే విమలకు రాఘవంటే ఇష్టం! చిన్నప్పటి నుంచీ తనతో కలిసి చదివిన మూలంగా ఆ యిష్టం ఆమెలో ఆమెకు తెలియకుండానే చిలవలు పలవలుగా అల్లుకుంది!

అయితే నెమ్మదిగా రాఘవను, శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో చదివిన చదువు, ఆ వాతావరణంలో మెట్టుమెట్టుగా ఎదిగిన మనసు, సుకుమారంగా రేకురేకుగా విచ్చుకునే పుష్పానికి ప్రతిరూపు అయిన హృదయం, తాత్వికులయిన తల్లిదండ్రులు పెంపకం కొత్తదారుల అన్వేషణకు గురిచేశాయి. వ్యక్తి ప్రయాణం, పరిణామ దశగా మలుపు తీసుకున్నప్పుడు నాలుగు గోడల మధ్య జీవితం అరుచి కావడం తప్పదేమో! ఆ వేళ రాఘవ, విమలతో అన్నాడు. "నువ్వన్నది నిజమే... చదువుకునే రోజులే నయం... ఏమీ తెలియని వయసులో మనం బహురూపులుగా ఉండేవాళ్ళం.... ఎదిగి... ఏమవుతామోనని అనిపిస్తోంది..."

"చూస్తూంటే నువ్వు వేదాంతిలా మారేటట్టు ఉన్నావ్..."

"ఈ బాహ్య ఆనందాలు, స్వేచ్ఛ, డబ్బు మీద మమకారం, చుట్టరికాలు, ప్రేమలు, అవమానాలు వీటి మనుగడ ఎంతటిదంటావ్?"

"ఈ లోకంలో ఉన్నంతవరకూ అన్నీ వెన్నంటే ఉంటాయి. తెల్సుకోవాల్సింది ఏమిటంటే పైవాడు మనల్ని హమేషా కాపాడాలనే చూస్తాట్ట. కానీ మనమే భగవంతుడికి దూరంగా

జరిగిపోతూ ఉంటాంట. అర్థం చేసుకో..."

రాఘవ నవ్వేశాడు – ఎంతో నిండుగా! దాంతో అతని మొహం వెలుగులు విరజిమ్మింది. అతని కుడి బుగ్గలో సొట్ట, క్షణం లోతుకు పోయి నవ్వుకు ప్రతిస్పందించింది. నవ్వు ఆగిన తరువాతే అది ఏమీ ఎరగనట్టు చర్మంలోకి అదృశ్యమయ్యింది.

"ఆఖరికి నిన్ను నవ్వించగల్గాను రాఘవా... అస్తమానం తెగ ఆలోచిస్తూ, ముడుచుకు పోయిన పెద్ద పెద్ద ఉపన్యాసాలు మాత్రం యివ్వకు..."

"అది సరే విమలా, నీ సంగతేమిటి – ఉద్యోగం చేస్తూ ఉండడమేనా?"

"నేను నా గురించి ఆలోచించకముందే మా వాళ్లు ఓ గట్టి నిర్ణయానికి వచ్చేశారు. నేను పాతికేళ్ళుగా ఈ శరీరాన్ని మోస్తోన్నందుకు ప్రతిగా దాన్ని పెళ్ళితో ప్రక్షాళనం చేయాలనుకుంటున్నారు.."

రాఘవ పకపకా నవ్వేశాడు.

"అయితే నీ పెళ్ళి మాటేమిటి? మీ అమ్మా నాన్నా ఊరుకున్నారా?"

"ఆ మధ్య మాటల్లో ఈప్రస్తావన వస్తే పెళ్లి మాట తలపెట్టవద్దని చెప్పాను."

విమల ఓక్షణం ఆగి, "ఎవర్నయినా ప్రేమించావా?" అని అడిగింది.

"ఆ, ప్రేమించాను"

"ఎవర్ని?"

"నీకుతెలియదా, నేనుఎవర్ని ప్రేమిస్తానో?"

'నువ్వు నాకు ఎప్పుడూ చెప్పలేదే" అంది, పెదాలు దాటి వస్తున్న నవ్వుని ఆపుకొంటూ. అయినా చిన్నగా నవ్వకుండా ఉండలేకపోయింది – విమల.

"పోనీ నువ్వు చెప్పు... నువ్వు ఎవరినయినా ప్రేమించావా?"

"ప్రేమించానూ" అంది విమల కాస్తంత కనీకనబడని సోయగంతో.

"ఎవర్ని?"

"నీకు తెలియదా రాఘవా అని అడగడమంటావా? వద్దులే... అలా అడిగి నిన్ను తేలికపర్చడం నాకిష్టం ఉండదు. ఎందుకంటే రాఘవ తెలివితేటల మీద నాకు నమ్మకం, గౌరవం కూడా!" విమల ఆగింది.

"నీకు అన్ని అర్హతలు ఉన్నాయి. విమలా, నిన్ను భార్యగా పొందేవాడని అదృష్టవంతుడని చెప్పాలి..."

సరిగ్గా అప్పుడే బయట నుంచి విమల తల్లిదండ్రులు వచ్చారు. రాఘవను ఆప్యాయంగా పలకరించారు. రాఘవ తను కొత్తగా చేపట్టిన వ్యాపారం గురించి చెప్పాడు. ఏవేవో మాట్లాడాడు.

"ఇక నువ్వు పెళ్ళి చేసుకుని ఓ ఇంటివాడివి అవడమే తరువాయి" అంది విమల

తల్లి, జానకి.

రాఘవ మాట్లాడలేదు.

"అవును రాఘవా.... నీ గురించి చాలా మంది అడుగుతున్నారు. మమ్మల్ని కూడా."

"రాఘవ ఒక అమ్మాయిని ప్రేమించేశాడు... లాభం లేదు, అని చెప్పెయ్యండి నాన్నగారూ"

"చాల్లె ఊరుకో... రాఘవ బుద్ధిమంతుడు" జానకి అంది.

"బుద్ధిమంతులు ప్రేమించరనా నీ ఉద్దేశ్యం?" విమల తండ్రి ప్రసాదరావు అన్నాడు నవ్వుతూ. రాఘవా మొహమాటంగా నవ్వాడు.

"అది కాదండీ" అంటూ ఏదో చెప్పబోయింది జానకి.

రాఘవ కుర్చీలోంచి లేచి, వాచీ చూసుకుని "నే వెడతానండీ మళ్ళీ కలుద్దాం... వెడతాను విమలా" అన్నాడు.

విమల డ్రాయింగ్ రూమ్ దాటి, మెట్లు దిగి, గేటు దాకా రాఘవకు తోడుగా వెళ్ళింది... సెయింట్ లూయిస్ స్ట్రీట్ వైపు మలుపు తిరిగేటంత వరకూ విమల రాఘవను చూస్తూనే ఉంది. "వెళ్ళొస్తాను విమలా" అంటూ కుడిచేయి ఊపుతూ వీడ్కోలు చెప్పిన అతని రూపాన్ని అంత చీకటిలోనూ పదిలంగా గుండెల్లో దాచుకుని ఇంటిలోకి మళ్ళింది – విమల!!

❖ ❖ ❖

రాఘవ తన దినచర్యలో భాగంగా సాయంత్రం శ్రీ అరబిందో ఆశ్రమానికి వెళ్ళాడు. కానీ, మెడిటేషన్ చేసి తిరిగి ఇంటి మొహం పట్టలేదు. అప్రయత్నంగా బీచ్‌రోడ్ వైపు మళ్ళాడు. అప్పటికే ఏడు గంటలు దాటింది. వెళ్ళి ఖాళీగా వున్న రాతి బెంచీ మీద కూర్చుని రెండు క్షణాలు సముద్రం వైపు పరిశీలనగా, నిండుగా చూశాడు. ఆ తరువాత ఓ క్షణం కళ్ళు మూసుకుని తెరిచాడు. రాఘవకు పదే పదే తల్లి చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి.

"నిన్న సాయంకాలం మనింటికి విమలా వాళ్ళ నాన్నగారూ, అమ్మగారు వచ్చారు"

"అలానా?"

"ఎందుకని అడుగుతావనుకున్నాను" గాయత్రి చిన్నగా నవ్వి అంది.

"నేను అడగాలేమిటమ్మా... నువ్వు చెబుతున్నావుగా... కానీయ్..."

"విమల చదువు పూర్తయ్యింది. అందుకే వాళ్ళు పెళ్లి కొడుకులవేటలో ఇటు వచ్చారు."

రాఘవ నవ్వేసి అన్నాడు "అవునమ్మా... పెళ్ళి కాని అబ్బాయిల, అమ్మాయిల వైనం మీకు బాగా తెలుసుకదా... అందుకనే..."

"చాల్లే వెక్కిరింతలు... అది కాదు విషయం..." అంటూ గాయత్రి జరిగింది చెప్పింది.

రాఘవకు తల్లి అలా మాట్లాడుతూ ఉంటే ఆమెకళ్ళల్లో ఆనందం, ఆ పైన మాటలు

పేర్చి చెప్పడంలో చిన్నపాటి తడబాటుతనం, బుజ్జగింపు అన్నీ కనిపించాయి. మౌనానికి ప్రతీకగా తలవంచుకుని ఉండిపోయాడు - రాఘవ.

"ఏమిటీ, ఇద్దరూ బొమ్మల్లా కూర్చుండిపోయారు. ఏదైనా సీరియస్ విషయం చర్చిస్తున్నారా" అంటూ లోపలి నుంచి రాజారావుగారు వచ్చారు... గాయత్రి తిరిగి భర్తతో చెప్పింది.

"అంతేకదా... దీనికేనా ఈ తన్మయత్వం. ఓరేయ్ రాఘవా, మీ అమ్మ నీకు పిల్లనిస్తామంటూ ఎవరూ మనింటికి రారేమోనని బెంగపెట్టుకుంది."

"అయినా ఇవన్నీ దేనికమ్మా."

"బావుంది... ఆయనేదో అంటే నీకైనా ఉండొద్దు... బ్రహ్మచారి, బెండకాయ రెండూ కూడా ముదిరితే నష్టమే..."

"మనవాళ్ళు ఈ సామ్యం ఆడవాళ్ళకు అన్వయించి చెప్పకుండా స్త్రీ జాతి గౌరవం నిలబెట్టారు. పెళ్ళి చేసుకోకపోతే చిల్లు కాణీగా మారంది ఒక్క మగవాళ్ళేనన్నమాట. ఇది అన్యాయమే" రాజారావు అన్నాడు నవ్వుతూ...

"ఆడది తను వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిణిగా బతకాలనే నిశ్చయానికి వచ్చినపుడు ఆమెను లోకంలో ఏ శక్తీ అడ్డుకోలేదు. అది భగవంతుడు స్త్రీకి ప్రసాదించిన వరం. కానీ ఇదే విషయంలో పురుషులు తమ మనోనిబ్బరం కోసం పడరాని పాట్లని ఎదుర్కోవలసి వస్తుంది..."

"నేను ఆఫీసుకు వెడతానమ్మా..."

"వాళ్ళకేం చెప్పమంటావ్?"

రాఘవ ఏమీ మాట్లాడలేదు. అక్కడి నుంచి కదిలాడు. గాయత్రి పక్కకు తిరిగి బయటకు వెడుతున్న కొడుకు నుంచి చూపు మరల్చుకుని, భర్తతో, "అదేమిటండీ... వాడు ఏం చెప్పకుండా పోతున్నాడు... మీరేమీ కలగజేసుకోరేమిటీ" అంది.

రాఘవ ఆలోచిస్తూనే ఉన్నాడు అలా! ఆ తరువాత ఆ ఆలోచనల నుంచి తల్లిదండ్రులు మాయమయి, ఆ చోటును విమల ఆక్రమించుకుంది... విమల కొత్త పెళ్ళి కూతురుగా, ఇల్లాలుగా, తల్లిగా - ఎలా ఊహించినా, పొందిగ్గా ఆ ఊహలో తనకు తానే సాటి అన్నట్టుగా యిమిడి కనిపిస్తోంది! ఇంతలో వెనక నుంచి "రాఘవా" అనే పిలుపు వినపడడంతో అతను వెనక్కి తిరిగి చూశాడు... తండ్రి దగ్గరగా వచ్చాడు... ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. రాజారావు 'పద, ఇంటికి వెడదాం" అన్నారు.

❖ ❖ ❖

"బ్రహ్మచర్యం పాటించడం అంటే అల్లా టప్పా విషయం కాదు రాఘవా? మనిషిలో కొన్ని సహజ గుణాలు ఉంటాయి. అది రాయిలాంటి కఠినత్వం కావచ్చు. పగ్గాలు లేని స్వేచ్ఛ కావొచ్చు. వీటి సమతౌల్యం పాటించగలగాలి. ఇంకా మనిషిలో భయం, కామతృష్ణ

నిద్రాహారాల మీద మమకారం వీటిని అదుపు చేయగల్గాలి...”

“ప్రయత్నిస్తే అవన్నీ సాధ్యపడేవే”

“వయసులో ఉన్న వ్యక్తి మీద కామప్రవృత్తి ఎనిమిది దిక్కుల నుంచీ దాడి చేస్తుంది. సృష్టిలో అందాలన్నీ ప్రకృతి కూడా స్త్రీకి దగ్గరవమని ప్రేరేపిస్తాయి. బలవంతాన నిగ్రహించుకున్న కొద్దీ – రెట్టింపు ప్రతిఘటన ఎదురవుతుంది.”

రాఘవ నెమ్మదిగా అన్నాడు... “నేను రెండేళ్ళుగా నా శరీరాన్ని క్రమశిక్షణలో పెట్టుకుంటూనే వున్నాను, నాన్నగారూ...”

రాజారావు నెమ్మదిగా అన్నాడు, “మేం ఈ ఆశ్రయానికి ఎలా వచ్చామో, ఆ రోజులూ అవీ గుర్తు చేసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. మేం పెళ్ళి చేసుకుని సంసారంచేశాం... కానీ, ఈ దారిలోకి వచ్చిన తరువాత...” ఆయన ఆగిపోయాడు.

“నాకు తెలుసు నాన్నగారూ..”

“మళ్ళీ ఇంకోసారి ఆలోచించు... నీ మీద మా ప్రభావం పడడం వేరు. దేనికైనా భగవంతుడి చల్లని చూపు ఉండాలి. యోగమార్గంలో వెళ్లేవారు, సంసారుల కన్నా ఎక్కువగా కష్టాల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది – మర్చిపోకు...”

రాఘవ తల ఊపి కుర్చీలోంచి లేచి టేబుల్‌మీద ఫైళ్ళు తీసుకుని బయటకు వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే గాయత్రి లోపలి నుంచి వచ్చి పుస్తకంలో తల దూర్చి ఉన్న భర్తను చూసివెళ్ళి ఆయనకెదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది.

“అయితే” అని గాయత్రి ఆగిపోయింది... రాజారావు దగ్గర నుంచి జవాబు రాలేదు.

“మీరు రాఘవతో మాట్లాడినవన్నీ విన్నాను....”

రాజారావు తలెత్తి గాయత్రి మొహంలోకి చూశాడు.

“చూడండి. వాడిది చిన్నతనం. అందుకని మనమే బాగా ఆలోచించాలి. అంతేగానీ వాణ్ణి మన వయసుతో జమకట్టి చూడకూడదు...”

రాజారావు ‘అలానా’ అని గలగలా నవ్వేసి – ఆ పైన నవ్వు ఆపుకొని – “చూడు, నేను ఎప్పుడైనా చిన్నపాటి కోపంలో, వాడింకా చిన్నపిల్లవాడు కాదు, గుర్తుంచుకో’ అని రుసరుసలాడితే – నువ్వు, వాడిది పసితనం, పోనివ్వండి’ అని నన్ను అడ్డుకునే దానివి... ఈ వేళ నేను వాణ్ణి కొడుకుగా కాకుండా ఆత్మీయుడిగా మాట్లాడుతూంటే...” అని ఆగిపోయాడు.

“మామూలు విషయాలు వేరండీ.... ఇది వాడి జీవితానికి సంబంధించినది...”

“నీ ఉద్దేశ్యం”

“ఇరవై ఏళ్ళ నాటి రోజులు. ఆనాటి సమాజం, మనం పెరిగిన వాతావరణం వేరు. మీకు, అబ్బిన శిక్షణ వేరు. కానీ ఈనాటి కుర్రాళ్ళది ఆవేశంతో నిండుకున్న ఏకదృష్టి ... అది చదువు అవొచ్చు... వ్యాపారం అవొచ్చు.. ప్రేమ కావొచ్చు...”

'నువ్వు భయపడుతున్నావా?"

'కాదండీ... నా మాట వినండి... మన పరిస్థితులు వేరు. మనం నలభై ఏళ్ళు రాకుండానే యోగమార్గంవైపు మళ్ళి, మనస్ఫూర్తిగా శారీరక సుఖాలను త్రోసి రాజన్నాం! అయినా అంత తేలిగ్గా సాధ్యపడిందనా... ఎన్ని..." అని గాయత్రి మాటలు ఆపి భర్త మొహంలోకి చూసి తిరిగి అంది... "వీడికి నిండా ముప్ఫై ఏళ్ళు నిండలేదు. బ్రహ్మచర్యం వీడివల్ల అయ్యేపనేనా? మన తరవాత వీడు ఒక్కడూ..."

"వాడు ఒంటరివాడెలా అవుతాడు – అరబిందో, మదర్ వాడి వాళ్ళు అయితే – " గాయత్రి మాట్లాడలేదు.

రాజారావు అనునయంగా అన్నాడు...

"చాలాకాలంగా నాకు అందరూ పరమాత్మ తాలూకు అంశగానే కనిపిస్తున్నారు. అందుకే నాకు – నువ్వు వేరు, రాఘవ వేరు, బంధుమిత్రులు వేరుగానూ అనిపించరు. నిన్నటివరకూ నువ్వెలా ఉన్నావు... ఒక్కరోజులో నీలో ఇంత మార్పు రావడం నాకు ఆశ్చర్యంగా కాదు, భయంగా ఉంది గాయత్రీ..."

గాయత్రి తలవంచుకుంది.

"రాఘవ తను ఉద్దేశించిన మార్గంలో వెడుతూ ఇబ్బందులు పడొచ్చు... ఆ తరువాత నిలదొక్కుకోవచ్చు... అది వాడి సాధన మీద ఆధారపడి ఉంటుంది."

"ఈ రోజు మన ఆదర్శం, ఆశయం ఒకటే – అది పరమాత్మతో అనుబంధం పెంచుకుంటూ ముందుకుపోవడం... ఈ తటపటాయింపులు, శషభిషలు, వెనకడుగులు తగ్గునా?" అంటూ రాజారావు గాయత్రిని ఊరడించాడు.

❖ ❖ ❖

ప్రసాదరావుగారు కూతురు విమలను పిలిచి పక్కన కూర్చోబెట్టుకుని, ఆప్యాయంగా పలకరించి, నెమ్మదిగా సంభాషణ పొడిగించి, తరువాత రాఘవ గురించి చెప్పాడు. విమల రాఘవ తీసుకున్న నిర్ణయం విని అదోలా తండ్రి వైపు చూసింది. ఆమెకు బాధను దాచిపెట్టుకోవడమే ఓ సమస్య అయింది. ఆ క్షణం! అయితే ప్రసాదరావు తమ మనసులో ఉద్దేశం చెప్పి, కూతురు తన భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకుంటే బావుంటుందో సలహాగా చెప్పాడు. తల్లి జానకి కూడా భర్తకు తోడుగా నిలబడింది. అలాగే విమలకు ధైర్యాన్ని అందించింది.

విమల, తల్లిదండ్రులు చెప్పిందంతా వింది. అయినా ఆమె తేలికగా మనసును ఓదార్చుకోలేకపోయింది.

"జాగ్రత్త... జరిగిందేదోజరిగింది... నువ్వు నిరాశపడొద్దు... ఎవరో ఒకర్ని పెళ్ళాడి నీ భవిష్యత్తును సుఖమయం చేసుకో... నీకు మదర్ అనుగ్రహం కూడా వుంటుంది."

విమల భోజనం చేసి టిఫిన్ బాక్స్ సర్దుకుని సర్దార్ పటేల్ రోడ్డు నుంచి ఆశ్రమం

వైపు మళ్ళింది. ఆమె ప్రశాంతంగా ఆశ్రమం లోకి వెళ్ళింది. అగరువత్తులు వెలగించి స్టాండ్‌లో పెట్టి తలొంచింది. అరబిందో, మదర్‌ల సమాధి ముందు పది నిముషాల తరువాత లేచి ఆశ్రమం దాటి సెయింట్ గిల్లెస్ స్ట్రీట్‌లోకి వెళ్ళింది.

సరిగ్గా అప్పుడే, రాఘవ సూట్‌కేస్‌తో మారుతికారు ముందు నిలబడి తలుపు తెరవబోతూ ఎదురుగా వస్తున్న విమలను చూశాడు; విమలా, రాఘవని చూసింది.

రాఘవ "ఇలాఎంతవరకూ" అని ప్రశ్నించాడు.

"మన క్లాస్‌మేట్ సరోజ కోసం ఇటువచ్చాను. అది ఇంట్లో లేదు మార్కెట్‌కు వెడదామని బయలుదేరాను... నువ్వు కనిపించావు..."

"అయితే కారు ఎక్కు... అక్కడ వదిలి పెడతాను..."

విమల థాంక్స్ చెప్పి కారు ఎక్కి రాఘవ పక్కన కూర్చుంది. రాఘవ స్టీరింగ్ చేతపట్టి అందంగా కారుని నడపడం, మొహం తిప్పకుండా మాట్లాడుతూ విన్యాసాలు పోవడం విమల ఎరగనిది కాదు... కానీ రాఘవతో తనకున్న చనువు కాస్తా అవరోధాల్లో పడిందని గుర్తొచ్చింది...

"ఏమిటి విశేషం?" రాఘవ అడిగాడు.

"విశేషాలన్నీ తెలిశాయిలే – తెలియజేశావ్‌గా, గొప్పగా" అంది కోపంగా.

రాఘవ కారును కాటేజ్ రెస్టారెంట్ దగ్గర ఆపి, "పద కాస్త టిఫిన్ చేస్తూ మాట్లాడుకుందాం... అభ్యంతరమా..." అని అడిగాడు.

విమల మాట్లాడలేదు. రాఘవతోపాటు మెట్లెక్కి కేంటీన్‌కు వెళ్ళింది. రాఘవ "ఊతప్పాలు, రెండు" అని ఆర్డరిచ్చి విమలను చూస్తూ...

"అమెరికాలో వీటిని పాన్‌కేక్‌లు అంటారు తెలుసుకదా?" అని అడిగాడు. విమల తెలుసునన్నట్టు తల ఊపింది. రాఘవ మౌనంగా విమల వైపు చూశాడు. కాసేపు అటూ ఇటూ చూసి, ఓసారి గొంతు సవరించుకుని "అసలేమయిందంటే....." అంటూ విమల తల్లితండ్రులు తనని అడగడం అన్నీ చెప్పి అన్నాడు "నువ్వు నా స్నేహితురాలివి, ఆత్మీయురాలివి అని చెప్పాను"

"అప్పుడేమయింది?"

"అప్పుడేమో, మా అమ్మ పెళ్ళి చేసుకునే ఇష్టం గురించి చెప్పు అని, నిలదీసింది... నేను నా విముఖత తెలియజేశాను... అదే పెళ్ళికే విముఖుణ్ణని చెప్పాను..." విమల మాట్లాడలేదు.

"నిన్ను బాధకు గురిచేశాను. నీలాంటి మనిషిని దూరం చేసుకోవాల్సి వస్తోందంటే అది బహుశా విధి రాత అయ్యుంటుంది".

"పోనివ్వు...ఏం చేస్తాం" అంది విమల. కానీ ఆమె గొంతుకు మాత్రం మాటల్లోకి తర్జుమా కాని ఆవేదనని పట్టి ఉంచలేకపోతోందని విమల గ్రహించింది... రాఘవకూ

అర్థమయింది.

"నువ్వు త్వరలో వెడ్డింగ్ కార్డు యిస్తావని ఎదురుచూస్తాను. విమలా?"

"నీది అత్యాశ"

విమల తలవంచుకుని తాగి వదిలిన కాఫీ కప్పును అటూ ఇటూ చేస్తూ, "నన్నో నిజం చెప్పమంటావా రాఘవా?" అని అడిగింది.

"చెప్పు.."

"నువ్వు పెళ్లి మానేసి బ్రహ్మచర్యం పాటించాలనే గట్టి నిర్ణయానికి వచ్చినప్పుడు నిన్ను కోరుకున్న నేనూ ఏమీ జరగనట్టు వేరెవర్నో పెళ్లి చేసుకోవడం తప్పు. నీ పరిభాషలో చెప్పాలంటే అధర్మం...."

రాఘవ కళ్ళు పెద్దవి చేసి విమల వైపు చూశాడు.

"నేను వెడతాను రాఘవా..."

"నా మాట విను విమలా, ఆవేశపడద్దు... నిరాశపడద్దు నువ్వు.... మనసు తిప్పుకుందుకు ప్రయత్నించు..."

విమల చిన్నగా నవ్వి, "మనసు తిప్పుకున్నాను. మిత్రమా... నిజమే... నాకూ నీలాగే వివాహం మానేసి బ్రహ్మచారిణిగా బతికితే బావుంటుందనిపించింది..."

"విమలా" అన్నాడు. తలవంచుకుని రాఘవ.

"అవును రాఘవా.. నువ్వు నా గురించి బాధపడొద్దు. బహుశా ఇది భగవంతుడి నిర్ణయం అయ్యుంటుంది..."

"కాదు విమలా... భగవంతుడు నీ విషయంలో అలాంటి నిర్ణయాలు చేయడు... చేయవద్దని ఆయన్ని వేడుకుంటాను..."

"వద్దు రాఘవా... ఎవరి ప్రార్థనలు వారివి... అన్నీ తెలిసిన వాళ్ళు ఎవరి మనసుకూ, కోరికకూ వ్యతిరేకంగా భగవంతుడికి విన్నపాలు చేయకూడదుట. అలా జరిగితే ప్రార్థనలు చేసిన వాళ్ళకు ఫలితం దక్కడంలో జాప్యం అవుతుందిట... నీకూ నాకూ కూడా టైం అవుతోంది పద వెడదాం..."

రాఘవ మార్కెట్ దగ్గర కారు ఆపాడు. విమల, "వెళ్ళొస్తాను అంది...", రాఘవ చటుక్కున "మళ్ళీ కలుద్దాం" అన్నాడు.

"చూద్దాం..." అంది. విమల. ఆ పైన వెను తిరిగింది.

రాఘవ కూడా కారు వెనక్కి తిప్పాడు. రాఘవ రోడ్డు మీద ఎంత ముందుకు పోతున్నా విమల చెప్పిన మాటలు, "డివైన్స్ మిస్టేక్స్ ఆర్ స్టిల్ డివైన్" అనేవే గుర్తుకొస్తున్నాయి... వేదాంతులు చెప్పే మాటయినా ఆ సూక్తి రాఘవకు ఎందుకో నచ్చలేదు... విమల వద్దన్నా విమల గురించి దేవుణ్ణి ప్రార్థించాలనే అతను నిర్ణయించుకున్నాడు!

❖